సీరియల్ కథ



# నిర్దోషి

★

రచన: "ప్రవీణ్ సుశ్రీ"

(గత సంచిక తరువాయి)

ఫ్లీస్! నిరాహారదీక్షురా బాబూ: నవ్వుతూ అన్నాడు మధు.

"ఎందుకంటా?" హేళనగా అన్నాడు గిరిని చూస్తూ నీలకంఠం.

"ఎందుకా; వీడేమో మార్నింగ్ షోకు పోవాలని వాళ్ళమ్మను అడిగుంటాడు డబ్బులు, అప్పుడామె ఇస్తుండగా వాళ్ళ నాన్నగారు చూసి తిట్టి వుంటాయి!" అన్నాడు నవ్వుతూ అందరూ హేళనగా నవ్వారు మధుతో బాటు.

"నవ్వండిరా! నవ్వండి! హాయిగా! నవ్వండి! మీకేం! మీతోటి మిత్రుడి బాధలతో మీకేమిటిరా? నాబాధలు మీరు అనుభవిస్తే గదా! మీరేడ్వడానికి, నవ్వండిరా! నవ్వండి!" అన్నాడు గిరి తన హృదయలోని బాధనంతా వెళ్ళగక్కుతూ.

అలా అనేప్పటికి మిత్రులు ముగ్గురూ మౌనపడిపోయారు జరుగగూడందేదో జరిగి పోయిందని తెలుసుకున్నారు.

గిరి అపుడు వస్తూన్న దుఃఖాన్ని దిగమింగుకొని వారిని తన గదిలోకి తీసుకవెళ్ళి, జరిగిన విషయం అంతా పూసగుచ్చినట్లు చెప్పాడు తన హృదయంలోని భాధ, రోష, ద్వేషం అన్నీవాళ్ళ ముందు వెళ్ళగక్కాడు. "ఒరేయ్! అసలు కథంతా విన్నారుగా! ఇపుడు చెప్పండి! రామూగాడిని ఇక్కడినుంచి ఎలా వెళ్ళగొట్టడం?"

మిత్రుడంటే సాటి మిత్రుడు బాధపడ్తూంటే! చూచి హేళన చేసెవాడు కాదురా! అతని బాధను, కష్టాన్ని తనదిగా భావించి, తనకు తగిన సహాయం చేయగలిగినవాడేరా నిజమైన మిత్రుడంటే!! అన్నాడు గిరి బాధాపూరిత హృదయంతో. ఈ కథ విన్న ముగ్గురికీ ఏడ్చినంత పనైంది.

"ఓస్! ఇంతేనాట్రా! ఇంకేమో వాడి పీక నులిమెయ్యమంటావేమో ననుకున్నాంరా! ఒకటేమిటి? వాడిని ఇంట్లోంచి వెళ్ళగొట్టాలంటే! సవాలక్ష మార్గాలున్నాయిరా! మొదట క్లాసులో గోల చేస్తుంటాడనీ! బడికి సరిగ్గా రాడనీ ఇంకా సిగరెట్లు, బీడీలు కాలుస్తుంటాడనీ ఇంకా ఇలాలేని పోనివి కల్పించి మీనాన్నకు వాడిమీద అయిష్టం వచ్చేలా చెప్పరా! అపుడు ఇంట్లోంచి బయటకు గెంటుతాడురా" అన్నాడు మధు.

"అబ్బ! మొఖం చూడు ఎల్లావుందో! అసలు వాళ్ళ నాన్న నమ్మడు తెలుసా? మార్కులు చెప్పడం లేదట్రా! వెర్రిమొఖమా!" అన్నాడు మోహన్ మధును గేలి చేస్తూ. మధు చిన్నబోయాడు.

"ఓరేయ్! నీవేం మాట్లాడవేమిరా?" — 'గిరి' అన్నాడు.

"ఉ...వస్తున్నా! వస్తున్నా వస్తున్నారా! వుచ్చ అదే వురిగా కూడా ఊపిరి ఆడకుండా ఉక్కిరి! బిక్కిరి జేసి" అనికేమో చెప్పబోయి, అర్ధోక్తిలోనే ఆపివేసి, మరిలా చెప్పడం ప్రారభించాడు నీలకంఠం. ఓరేయ్! అసలు మేమొకటి చెప్పాలనే వచ్చాం అది సరే గానీ! మీనాన్నగారేరీ! రాముగాడేడీ" అర్ధోక్తిలో ఆపి అన్నాడు.

"మానాన్నగారు విశ్వనాథం మామయ్య ఇంటికెళ్ళాడు, మన విలన్‌గాడు బజారువెళ్ళాడు" అన్నాడు.

"అయితే! ఫర్వాలేదు అన్నమాట మరైతే ముందు తలుపు గడియవేసిరా అసలు విషయానికి వస్తాను" అన్నాడు నీలకంఠం.

"ఇదేదో! పెద్దప్లానులాగుందే" అనుకుంటూ గిరి

తలుపుగడియ పెట్టివచ్చి" "ఊఁ ఇక చెప్పరా" అన్నాడు.

"ఆ! అదే! మేమొకటి నీకు చెప్పాలని వచ్చాం గానీ మాకంటే నీవే ఇంకొకటి చెప్పి మాకు ఇంకో సమస్యను తెచ్చి పెట్టావు? మనమేధా శక్తినంతా ఉప యోగించి ఈ రెండు సమస్యలనూ ఒకే సమస్యగా చేసి మనం కార్యం సాధించాలి, అందుకు నేనో పథకం వేస్తున్నానురా గిరి! అసలు నీకు చెప్పాలని మేము అను కున్నదిది. ఏమంటే! మేమందరమూ మద్రాసు నగరానికి పోనిశ్చయించాము మరి తమరి అభిప్రాయం?" నీలకంఠం కంఠం మరీ తగ్గించి నాటకఫక్కీలో అన్నాడు. అందులో కాస్త హుందావుందా అన్పిస్తోంది.

"అబ్బ! రామూను వెళ్ళగొట్టరా బాబూ! అంటే! మమ్ములనందర్నీ ఈ వూరినుండి వెళ్ళగొట్టానంటావేం?" అన్నాడు గిరి ముందుగా రాము విషయం చూడ మన్నట్లుగ.

"ఒరేయ్! మొద్దూ! రామూగాడు ఇంటి నుండి వెళ్ళడమే కాదురా వాడు జైలుకు పోయిన తర్వాత నేరా మనం మద్రాసుకి పోవడం" నీలకంఠం ఈ విధంగా ఆనేప్పటికి వింటున్న ముగ్గురికీ ఉత్సాహం పొడ సూపింది.

"ఎలారా? చెప్పరా బాబూ!" అని అడిగారు ముగ్గురూ ఒక్కసారి.

"ఒరే! గిరీ! మరినీవుగూడా వస్తావుగదా మద్రాసుకి?"

"ఓస్! ఒక్క మద్రాసేంటి! బొంబాయి! ఢిల్లి, హైద్రాబాద్" అనింకేమో పెదాలు కదిలిస్తూ చేతులు గాలిలోకి విసురుతూ చెపుతూండగానే! నీలకంఠం అర్థోక్తిలోనే అందుకున్నాడు.

"ఆ! ఇక ఆపరా బాబూ! ఒక్క మద్రాసే ప్రస్తుతానికిచాలు" అని ఒకసారి అందరి వంకా చూచి,





* ఎలెక్ట్రిక్ మోటార్లు.
* కాఫీ గింజలను రోస్ట్ చేసే యంత్రములు.
* కాఫీ గింజలను రుబ్బే యంత్రములు.
* నానపెట్టబడ్డ ఆహార ధాన్యాలను రుబ్బే యంత్రములు.
* చికరి మిక్సింగ్ మెషిన్సు.

ఈ యంత్రములన్నీ తయారుచేస్తున్నాము, మీకు కావలసినవాటికి ఆర్డరు ఇస్తే వెంటనే పంపగలము.

ఆంధ్రప్రదేశంలోని ఏడన్నీ పరతులకు దరఖాస్తులు కోరబడుచున్నాము.

: వివరములకు :

Phone: 22430

JOTHI ENGINEERING WORKS

165, PATEL ROAD :: COIMBATORE-641009

పర్సుకాలరెత్తుకొని కంఠంమీది గొంతు కాయను సరిచేసు కున్నాడు నీల కంఠం.

"ఒరేయ్ నీ ఫోజుశాస్త్ర తగ్గించి, అసలు ఎలా వెళ్ళడమో చెప్పరా నీలిగా!" అన్నాడు గిరి అమాయకంగా!

"ఎలా! ఏమిట్రా! చచ్చుపీనుగా! రైలెక్కి! ఆ మాత్రం తెలియదట్రా"? మోహన్ అందుకున్నాడు చిరాగ్గా.

"చాల్లేవోయ్! మహాచెప్పచ్చావ్! నీ తెలివి తెల్లారి నట్లేవుంది మరి చార్జీలు?" అన్నాడు మధు క్రాస్ ఎగ్జామిన్ చేస్తూ.

"చార్జీలా! గీర్జీలా! ఒట్టి చవట వెధవల్లాగున్నా రోయ్! అసలు మీరీ సెంచరీలో పుట్టాల్సినవారు కాదురా! మా బామ్మ బామ్మ అమ్మ అమ్మమ్మ పుట్టింది చూసారూ? ఆరోజుల్లో పుట్టవలసిన వెధవలురా! ఈ యుగంలో అవతరించారు అవతరించారుపో! నాకు స్నేహితులుగా దాపురించారు!" కొంచం హేళనగా ఇంకొంచం కోపంగా విసుగ్గా అన్నాడు నీలకంటం.

నీలకంటం ఇదివరకు ఇంట్లో డబ్బులు కాజేసి రెండు మూడు సార్లు మద్రాను ప్రదక్షిణం చేసి వచ్చిన వాడే! అంతే కాదు చార్జీలేకుండా ప్రయాణం చేయడం వల్ల పొరపాటున పట్టుబడి బళ్ళారిలోని పిల్లల జైలు కూడా ప్రదక్షిణం చేసొచ్చిన ఘటమే. ఏమైతేనేం! అటు మద్రాసుపోయే రూటు ఈ రెండూ నీలకంఠానికి బాగా తెలుసు అందుకే అంత ధైర్యంగా మాట్లాడ గల్గుతున్నాడు.

"సరే బావుంది మరిపొట్ట మాటేమిటి?" అన్నాడు మధు "అవున్రోయ్ నాకు తట్టనే లేదు. ఏంలాభం? నాకూ మెదడుంది. కానీ నీలాంటి పచ్చమెదడు లేదు గదా కాబట్టి ఒక్కొక్కరు 20 రూపాయలు తెచ్చు కుంటె చాలు ఆ మద్రాసునే కొనేయవచ్చు సరేనా? చెప్పడం ఆపి అన్యమనస్కుడై ఎటో ఆలోచిస్తున్న గిరిని తట్టి "ఏంరోయ్ సెహ్రాగారి ఫోజుపెట్టావ్, నేను చెప్పింది నీకు నచ్చినట్లేనా? లేదా?" అన్నాడు నీలకంటం గిరి నుద్దేసించి.

"నచ్చిందిరా! కానీ డబ్బులు అమ్మో 20 రూపాయలే ఎలా?"

"ఒరేయ్! ఎందుకు అలా బెంబేలు పడిపోతావు అసలు ప్రయత్నించకుండగానే. మానవుడు సాధించ నిదేదీ లేదురా! అనుకుంటే చచ్చిన వాళ్ళను కూడా బ్రతికించ గలడు సుమా!"

"అదికాదురా, సాధిస్తా! ప్రయత్నిస్తా! అదికాదు నేననేది అసలు మా నాన్న నోట్లు బేబులో పెట్టుకోడుగా చిల్లర ఐతే! మీరు చెప్పినట్లు రామూగాడి విషయం తీస్తాననుకో మరి 20 రూపాయలు ఎలా సంపాదించాలా అని!" గిరి నసుగుతూ అన్నాడు నీలకంఠాన్ని చూస్తూ!

"ఎలా! గట్టి చిక్కే పడిందే?" అన్నాడు మోహన్. మధు మాత్రం ఏదో వేళ్ళు లెక్కపెట్టు కుంటూ! ఆలోచిస్తూన్నాడు.

మరి మద్రాసును గురించి గాలిమేడలు కట్టుకున్నా డేమో! తనస్మృతి పథంలో, మరి ఎవరికేం తెలుసు?

నీలకటం ఆలోచనా సాగరంలో ఓ చిల్లుపడిన పడవలో ప్రయాణం చేస్తున్నాడిపుడు. ఏమీ పాలు పోవడం

Tel.: Export Phone: 21443

ఏనుగు బ్రాండ్

CARNATAKA KNITTING COMPANY

INDIA

CKC

"సి. కె. సి." బనియన్లు
ధరించుటకు హాయినిచ్చును.
అన్ని చోట్ల దొరుకును.

: తయారించువారు :

The Carnataka Knitting Co.
Post Box No. 252
TIRUPUR-638602.

MAHENDRA

పంపులు - మోటారులు

మీరు...

ఎక్కువ పంటలు పండించుటకు



మహేంద్ర



పంపులు మరియు మోటారులను అమర్చండి.

"మహేంద్ర" ఎలెక్ట్రిక్ మోటారులు మరియు సెంట్రిఫ్యూగల్ పంపులు సింగిల్ ఫేస్, 3 ఫేస్ మోనోబ్లాక్స్ కప్పల్డ్ సెట్ మరియా బెల్ట్ పంపులు అన్ని సైజులలోనూ దొరుకును.

ఆంధ్ర ప్రభుత్వము వారిచే తక్కావి కంతులలో అంగీకరించబడినది.

——— వివరములకు ———

ఫోన్: 80138. గ్రాం: "మహీపంప్"

**MAHENDRA**
**ENGINEERING WORKS**
**Coimbatore - 641037.**

లేదు. చివరికి ఆసాగరంలో అటు ఇటు మునిగి ఎలాగైతే నేం చివరికో ఒడ్డుకు చేరుకోగలిగాడు.

ఆ! "తట్టింది! తట్టింది!" అని అరిచాడు. ముగ్గురూ ఆశ్చర్యంతో ఏమిటేమిటని అడిగారు.

"ఒరేయ్! గిరి! ఈ నీలకంటం ఐడియాలు వేసా డంటే! ఎదుటివారి కంచం పట్టుక పోవల్సిందే! తెలుసా? ఇంతబుర్ర నాకుంటే! ఆ ఒక్కపంతులుగారు మట్టి బుర్రంటాడేరా?" నీలకంటం తన గొప్పనుతానే ఈ విధంగా చాటుకుంటూ చెప్పాడు.

"ఒరేయ్! నిజంగా! బుర్రలో మట్టివుంటుందం టావా?" అమాయకంగా ప్రశ్నించాడు మధు.

"ఒరేయ్! మన బక్కపంతులన్నట్లు వీడిది మట్టి బుర్రేరా!" అన్నాడు మోహన్.

వెంటనే నీలకంటం కోపాన్ని ఆపుకోలేక పోయాడు. "ఒరేయ్! మోహన్ అయితే! నీ ఉద్దేశం?" అన్నాడు.

"నీవు తెలివి తక్కువ వాడవనిగాదోయ్ నేనన్నది మొన్న నీవు తలగోక్కుంటుంటే బండెడు దుమ్మురా లింది. అందుకే మట్టి బుర్రన్నాను" అని తన తెలివి తేటల్ని ప్రదర్శించాడు.

అపుడు వాడి అమాయకతకు వ్యంగ్యధోరణికి నిమిషం పాటునవ్వుకున్నారు. అప్పటి వరకూ తనను మట్టిబుఱ్ఱన్నాడేయని ఫీలవుతున్న నీలకటం ధైర్యంగా 'గర్వంగా' మిత్రులవంక చూస్తూ నవ్వాడు.

"ఒరేయి" చూడు చెప్పేదేమిటో సరిగా చెప్పి ఏడ్వరా?" గిరి వాళ్ళనాన్న వస్తాడేమోనని భయం కొద్దీ అన్నాడు నీలకంటం నుద్దేసింది.

"ఒరేయి! ఈ పథకం నీ కోసమేగదరా! తొందర పడ్డావేం? చెప్తాగా ఈ దెబ్బకి రెండు పిట్టలు రా వేశా ద్రాబాబు! ఆ ఏమీలేదు మీనాన్నకి ఆదే స్మగుల్డ్ రిష్టు వాచి వుందిచూడు దాన్నికాస్తకాజేసి నాచేతికిచ్చేయి! మనము మద్రాసు వెళ్ళవచ్చు, ఇటు మన విలన్‌గాడు జైలుకీ పోవచ్చు! ఏం? ఎలాగుందిరా మనప్లాన్? బాగా లేదూ?

"అబ్బ! మాష్టర్ ప్లాన్ రాబాబూ!"

"అమోఘం! అద్భుతం"

"అబ్బా! కామరాజ్ పథకంలాగుందిరా!" ఇలా తలొక రకంగా మెచ్చుకున్నారు నీలకంఠాన్ని.

"ఏం! రోయి! గిరి! నీవు మరివచ్చలేదురా?" నీలకంటం తనకంటం రెట్టించి మరీ అన్నాడు.

"వచ్చిందిరా, కానీ ఎలా?" గిరి నీరసంగా అన్నాడు. "అదంతా! నీలోనేవుంది కాస్త నీ బుడి చేతికి, మరి బుర్రకికాస్త పనికల్పించు గిరి" అని ఇక తక్కిన వాళ్ళవైపు తిరిగి మంచిఫోజు పెట్టూ, "ఒరేయి! వాడిపని అంది మరి మీరు ఒక్కొక్కరు ఇరువైరూపాయల చొప్పున తెస్తారుగా! నేను ఎటూ యాభైరూపాయలు తెస్తాననుకో" అన్నాడు. అసలు నీలకంటం వాళ్ళు, వీళ్ళు తెస్తే, వాళ్ళ కంట్లో ఒకచారెడు కారం చల్లివెళ్ళేరకమే గాని ఏమీ తెచ్చేరకంగాదు. యాభై రూపాయలు కాదుగదా వాడి మొఖానికి ఒక యాభై పైసలు గూడా దొరకవు. కానీ ఒతిడాబులు కొట్టడం మాత్రం బాగా తెలుసును. మధు, మోహన్‌లు ఇద్దరూ గంగిరెద్దులా వారి బుర్రల నాడించేవారు అవును 'కాదు' అన్న భేధం లేకుండానే.

"భేష్! చాలాటైం అయ్యింది ఇక వస్తామంటూ గిరి వద్ద శెలవు తీసుకుని ఏమిటేమిటని గుస! గుసలు చెప్పు కుంటూ తలుపు తీసుకుని బయటకు వచ్చేశారు మధు, మోహన్, నీలకంటం.

పోతూన్న ఆ మిత్ర బృందాన్ని చూస్తూ నిశ్చేష్టుడై నిలుచుండి పోయాడు గిరి.

ఆనాటినుండి శంకరం జేబులో ఎంత చిల్లర వుంటే అంత చిల్లర మటుమాయ మాతూంది. గిరి బృందం కోరికలు తీరిపోతున్నాయి. మొదట్లో శంకరం పట్టించుకో లేదు. కానీ క్రమేణా గిరి అతనిపై చాడీలు చెప్పి రామూని దొంగగా నిరూపింప జేయడంతో శంకరం గారికి కొద్దిగా సంశయం కల్గింది.

గిరి ఒకరోజు "నాన్నా! ఆ రాముగాడు సిగరెట్లు తాగుతూన్నాడని, మరొక రోజు బళ్ళో బాగాగోల చేస్తుంటాడని, ఇంకొకరోజు అసలు బడికి రావడం మానివేసి కాలువలవెంట తిరుగుతున్నాడని ఈ విధంగా వున్నవీ లేనివీ రోజుకొకటి, తన మిత్రబృందం తనకు చేసిన హితోపదేశానుసారంగా శంకరం గారిని నమ్మేలా చెప్పేవాడు.

"ఒరేయి! ఇది నిజమట్రా! వాడు సిగరెట్లు త్రాగుతున్నాడా?" అని శంకరంగారు ప్రశ్నించాడు.

వెంటనే గిరి వుత్సాహంతో "కావాలంటే వాడి జేబులు ఇపుడు తనిఖీ చేయండి" అన్నాడు. తానిది వరకే రాముకు తెలియకుండా, స్టాండుకు తగిలించి వున్న రామూ నిక్కరులో ఒక సిగరెట్ పెట్టె ఒక అగ్గి పెట్టె పెట్టివుంచాడు.

శంకరం గిరి చెప్పింది నమ్మలేక తానేస్వయంగా వెళ్ళి తగిలించివున్న రామునిక్కరులో వెతికాడు ఇంకేముంది సిగరెట్ పెట్టె, అగ్గిపెట్టె అగుపించాయి. ఇక ముందు వెనకా ఆలోచించకుండా "ఒరేయి! రామిగా!" అని ఇల్లంతా దద్దరిల్లేట్టు అరిచాడు గిరి. గదివూడుస్తున్న రాము ఆ పిలుపుతో వులిక్కిపడి పరుగెత్తుకుంటూ వచ్చి, "పిల్చారండి" అని ఎంతో వినయంగా అన్నాడు. శంకరంగారు నిప్పుత్రొక్కిన కోతిలా గంతు లెయ్యడం గమనించాడు. ఏదో గిరి పన్నాగం పన్ను తున్నాడని గ్రహించాడు, గిరివైపు దీనంగా చూశాడు రాము. గిరి మొఖం త్రిప్పుకున్నాడు.

(సశేషం)

తమిళనాడు ప్రభుత్వమువారిచే
అంగీకరించబడినది.
T. N. S. I. No: 00124-08-18 CNL
ఎల్లప్పుడూ...
LOTUS HAND LOOMS MADURAI.
లోటస్ బ్రాండ్
బెడ్ షీట్స్, టవల్స్ దోవతులు,
టర్కీ జక్కార్డ్, టవల్స్ మరియు
నేప్కిన్స్‌నే వాడండి!
: తయారించువారు :
లోటస్ టెక్స్టైల్స్
13, ఖాన్ పాలయం 4-వ వీధి,
మధురై - 625009.